"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీ ఆశలన్నీ పూర్తవుతాయి, కడుపు నిండుతుంది, తండ్రి మిమ్మల్ని తృప్త ఆత్మలుగా చేయడానికి వచ్చారు"

ప్రశ్న:- ఇప్పుడు పిల్లలైన మీరు భక్తినైతే చేయరు కానీ మీరు తప్పకుండా భక్తులే - అది ఎలా?

జవాబు:- ఎప్పటివరకైతే దేహాభిమానము ఉంటుందో అప్పటివరకూ భక్తులే. మీరు జ్ఞానిగా అయ్యేందుకు చదువుతున్నారు. ఎప్పుడైతే పరీక్ష పాస్ అవుతారో, కర్మాతీతముగా అవుతారో, అప్పుడు సంపూర్ణ జ్ఞాని అని అంటారు. అప్పుడిక చదవాల్సిన అవసరం లేదు.

ఓం శాంతి. భక్తులు మరియు భగవంతుడు, ఇద్దరు ఉన్నారు కదా. పిల్లలు మరియు తండ్రి. భక్తులైతే ఎంతోమంది ఉన్నారు. భగవంతుడు ఒక్కరే. పిల్లలైన మీకు ఇది చాలా సహజమైన విషయముగా అనిపిస్తుంది. ఆత్మలు శరీరము ద్వారా భక్తి చేస్తారు, ఎందుకు? భగవంతుడైన తండ్రిని కలుసుకునేందుకు. భక్తులైన మీరు ఇప్పుడు డ్రామాను అర్థం చేసుకున్నారు. ఎప్పుడైతే పూర్తి జ్ఞానిగా అవుతారో అప్పుడిక ఇక్కడ ఉండరు. స్కూల్లో చదువుకుంటారు, పరీక్ష పాస్ అయిన తర్వాత ఇంకొక తరగతిలోకి వెళ్ళిపోతారు. ఇప్పుడు మిమ్మల్ని భగవంతుడు చదివిస్తున్నారు. జ్ఞానికి అయితే చదువు యొక్క అవసరం ఉండదు. భక్తులను భగవంతుడు చదివిస్తున్నారు. ఆత్మలమైన మనం భక్తి చేసేవారమని మీకు తెలుసు. ఇప్పుడు భక్తి నుండి బయటపడి జ్ఞానములోకి ఎలా వెళ్ళాలి - ఇది తండ్రి నేర్పిస్తారు. ఇప్పుడు భక్తిని చేయడం లేదు కానీ దేహాభిమానములోకి అయితే వచ్చేస్తారు. ఇది కూడా మీరు అర్థం చేసుకున్నారు, ఆ భక్తులకైతే భగవంతుడి గురించి కూడా తెలియదు. మాకు తెలియదు అని వారు స్వయమూ అంటారు. నెంబర్ వన్ భక్తుడు ఎవరైతే ఉన్నారో, వారిని కూడా తండ్రి అడుగుతారు, నీవు ఏ భగవంతునికైతే భక్తునిగా ఉండేవాడివో వారి గురించి నీకు తెలుసా? వాస్తవానికి భగవంతుడు కూడా ఒక్కరే ఉండాలి. ఇక్కడైతే అనేక భగవంతులు అయిపోయారు. స్వయాన్ని భగవంతునిగా పిలుచుకుంటూ ఉంటారు. దీనిని అజ్ఞానము అని అంటారు. భక్తిలో ఘోర అంధకారము ఉంది. అది ఉన్నదే భక్తి మార్గము. జ్ఞానాంజనమును సద్గురువు ఇచ్చారు, దానితో అజ్ఞానాంధకారము వినాశనమయ్యింది అని భక్తులు గానం చేస్తూ ఉంటారు. జ్ఞానాంజనమును గురువులు ఇవ్వలేరు. గురువులైతే ఎంతోమంది ఉన్నారు. భక్తిలో ఏమేమి చేసేవారో, ఎవరిని స్మృతి చేసేవారో, ఎవరిని పూజించేవారో పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు మీ ఆ భక్తి అంధకారము తొలగిపోయింది ఎందుకంటే తండ్రిని తెలుసుకున్నారు. మధురాతి మధురమైన పిల్లలూ, మీరు ఒక ఆత్మ, మీరు ఈ శరీరముతోపాటు పాత్రను అభినయించారు అని తండ్రి పరిచయాన్ని ఇచ్చారు. మీది అనంతమైన జ్ఞానము. మీరు అనంతమైన పాత్రను అభినయిస్తూ ఉంటారు. మీరు హద్దులో నుండి బయటకు వచ్చి ఇప్పుడు అనంతములోకి వెళ్ళిపోయారు. ఈ ప్రపంచము కూడా పెరుగుతూ, పెరుగుతూ ఎంత అనంతములోకి వెళ్ళిపోయింది, మళ్ళీ తప్పకుండా హద్దులోకి వస్తుంది. హద్దులో నుండి అనంతములోకి, అనంతములో నుండి హద్దులోకి ఎలా వస్తారు - ఇది ఇప్పుడు పిల్లలైన మీకు తెలుస్తుంది. ఆత్మ చిన్న నక్షత్రము వంటిది, ఇది అర్థం చేసుకుంటారు, అయినా కానీ ఇంత పెద్ద లింగాన్ని తయారుచేస్తారు. వారు కూడా ఏమీ చేయగలరు, ఎందుకంటే చిన్న బిందువు యొక్క పూజనైతే చేయలేరు. భృకుటి మధ్యలో సితార మెరుస్తూ ఉంటుంది అని అంటారు. ఇప్పుడు సితారకు భక్తి ఎలా చేయాలి? భగవంతుని గురించి అయితే ఎవరికీ తెలియదు. ఆత్మ గురించి తెలుసు. ఆత్మ భృకుటి మధ్యలో ఉంటుంది, అంతే. ఆత్మయే శరీరాన్ని తీసుకొని పాత్రను అభినయిస్తుంది అన్నది బుద్ధిలోకి రాదు. మొట్టమొదట మీరే పూజ చేసేవారు. పెద్ద-పెద్ద లింగాలను తయారుచేస్తారు. రావణుని చిత్రాన్ని కూడా రోజురోజుకు పెద్దగా తయారుచేస్తూ ఉంటారు, చిన్న రావణుడినైతే తయారుచేయలేరు. మనుష్యులైతే చిన్నగా ఉంటారు, ఆ తర్వాత పెద్దగా అవుతారు. రావణుడిని ఎప్పుడూ చిన్నగా చూపించరు, అతను చిన్నగా, పెద్దగా అవ్వడు. అతను స్థూలమైన వస్తువేమీ కాదు. రావణుడు అని పంచ వికారాలను అంటారు. పంచ వికారాల వృద్ధి జరుగుతూ ఉంటుంది ఎందుకంటే తమోప్రధానముగా అవుతూ ఉంటారు. ఇంతకుముందు దేహాభిమానం ఇంతగా ఉండేది కాదు, తర్వాత పెరుగుతూ వచ్చింది. ఒక్కరి పూజను చేసారు, ఆ తర్వాత ఇంకొకరి పూజను చేసారు. అలా వృద్ధి చెందుతూ వచ్చారు. ఆత్మ తమోప్రధానముగా అయ్యింది. సతోప్రధానముగా ఎప్పుడు ఉంటారు? మళ్ళీ తమోప్రధానముగా ఎప్పుడు అవుతారు? అన్నది బుద్ధిలో ఉన్న మనుష్యులు ప్రపంచములో ఇంకెవ్వరూ ఉండరు. ఈ విషయాల గురించి మనుష్యులకు ఏమాత్రమూ తెలియదు. జ్ఞానము కష్టమేమీ కాదు. తండ్రి వచ్చి చాలా సహజమైన జ్ఞానాన్ని వినిపిస్తారు, చదివిస్తారు. అయినా కానీ మొత్తం

చదువు అంతటి సారము ఏమిటంటే - ఆత్మలమైన మనం తండ్రి పిల్లలము, తండ్రిని స్మృతి చేయాలి.

కోట్లాదిమందిలో ఏ ఒక్కరో అన్న గాయనము కూడా ఉంది, ఎంత కొద్దిమంది వెలువడుతారు. కోట్లాదిమందిలో ఏ కొందరో మాత్రమే యథార్థ రీతిగా తెలుసుకుంటారు. ఎవరిని? తండ్రిని. తండ్రి ఎక్కడైనా ఇలా ఉంటారా? అని అంటారు. తమ తండ్రిని గురించి అయితే అందరికీ తెలుసు. తండ్రిని ఎందుకు మర్చిపోయారు? దీని పేరే భూల్-భూలయ్యా (తికమక దారుల) ఆట. ఒకరేమో హద్దులోని తండ్రి, ఇంకొకరు అనంతమైన తండ్రి. ఇద్దరు తండ్రుల నుండి వారసత్వము లభిస్తుంది. హద్దులోని తండ్రి నుండి కొద్ది వారసత్వమే లభిస్తుంది. రోజురోజుకు అది పూర్తిగా తగ్గిపోతూ ఉంటుంది. ఏమీ లేనట్లుగా అయిపోతుంది. ఎప్పటివరకైతే అనంతమైన తండ్రి రారో అప్పటివరకూ కడుపు నిండదు. మొత్తం కడుపు అంతా ఖాళీ అయిపోతుంది, తండ్రి వచ్చి కడుపు నింపుతారు. ప్రతి విషయములోనూ ఎలా కడుపు నింపుతారంటే ఇక పిల్లలైన మీకు ఏ వస్తువు యొక్క అవసరము ఉండదు. అన్ని ఆశలను పూర్తి చేసేస్తారు. ఆత్మ తృప్తిగా అయిపోతుంది. ఏ విధంగా బ్రాహ్మణులకు తినిపించినప్పుడు ఆత్మ తృప్తిగా అవుతుంది కదా. ఇది అనంతమైన తృప్తి. ఎంత తేడా ఉందో చూడండి. ఆత్మ పొందే హద్దులోని తృప్తికి మరియు అనంతమైన తృప్తికి ఎంత తేడా ఉందో చూడండి. తండ్రిని తెలుసుకోవడంతోనే తృప్తిగా అయిపోతుంది ఎందుకంటే తండ్రి స్వర్గాధిపతిగా తయారుచేస్తారు. మనం అనంతమైన తండ్రి పిల్లలమని మీకు తెలుసు, తండ్రినైతే అందరూ తలచుకుంటారు కదా. ఇది ప్రకృతి, మేము బ్రహ్మములో లీనమైపోతాము అని కొందరు అంటారు కానీ బ్రహ్మములో ఎవ్వరూ లీనమవ్వరని తండ్రి తెలియజేశారు. ఇది అనాది అయిన డ్రామా, ఇది తిరుగుతూనే ఉంటుంది, ఇందులో తికమకపడాల్సిన అవసరమేమీ లేదు. నాలుగు యుగాల చక్రము తిరుగుతూ ఉంటుంది. యథావిధిగా రిపీట్ అవుతూ ఉంటుంది. తండ్రి ఒక్కరే, ప్రపంచము కూడా ఒక్కటే. వారు ఎంతగా కష్టపడుతూ ఉంటారు. చంద్రునిలో కూడా ప్రపంచము ఉందని, తారలలో కూడా ప్రపంచము ఉందని భావిస్తారు. ఎంతగా వెతుకుతూ ఉంటారు. చంద్రునిలో కూడా ప్లాట్లు తీసుకోవాలని ఆలోచిస్తూ ఉంటారు - అది ఎలా జరుగగలదు. డబ్బులు ఎవరికి ఇస్తారు? దీనిని సైన్స్ అహంకారము అని అంటారు. అంతేకానీ ఇంకేమీ లేదు. ట్రయల్ చేస్తూ ఉంటారు. ఇదంతా మాయ ఆర్భాటము కదా. స్వర్గము కంటే ఎక్కువ ఆడంబరము చేసి చూపిస్తారు. స్వర్గమునైతే మర్చే మర్చిపోయారు. స్వర్గములోనైతే అపారమైన ధనము ఉండేది. ఒక్క మందిరము నుండే ఎంత ధనాన్ని తీసుకువెళ్ళిపోయారో చూడండి. భారత్ లోనే అంతటి ధనము ఉండేది, ఖజానా ఎంతో సంపన్నముగా ఉండేది. మహ్మద్ గజనీ వచ్చాడు, దోచుకొని వెళ్ళాడు. అర్ధకల్పమైతే మీరు సమర్థముగా ఉంటారు, దొంగతనం మొదలైనవాటి విషయమే ఉండదు. రావణ రాజ్యమే ఉండదు. రావణ రాజ్యము ప్రారంభమవ్వడంతోనే దొంగతనాలు, గొడవలు మొదలైనవన్నీ ప్రారంభమయ్యాయి. రావణుడి పేరు తీసుకుంటారు కానీ వాస్తవానికి రావణుడు అంటూ ఎవరూ లేరు. వికారాలు ప్రవేశించాయి. రావణుడి కొరకు మనుష్యులు ఏమేమి చేస్తూ ఉంటారు. ఎంతగా జరుపుకుంటారు. మీరు కూడా దసరాను జరుపుకునేవారు, రావణుడిని ఎలా కాలుస్తారో చూసేందుకు వెళ్ళేవారు. మళ్ళీ బంగారమును తీసుకునేందుకు వెళ్తారు. అసలు అవన్నీ ఏమిటి, ఇప్పుడు ఆశ్చర్యమనిపిస్తుంది. ఎలా అయిపోయారు. పూజ మొదలైనవి ఎంతగా చేసేవారు. ఏదైనా పండుగ రోజు ఉంటే ఏమేమి చేస్తూ ఉంటారు. భక్తి మార్గము బొమ్మల ఆట వంటిది. అది కూడా ఎంత సమయం నడుస్తుంది, ఇది మీకు తెలుసు. ప్రారంభములో అంత చేసేవారు కాదు. ఆ తర్వాత వృద్ధి చెందుతూ-చెందుతూ ఇప్పుడు ఎటువంటి పరిస్థితి ఏర్పడిందో చూడండి. ఇంత ఖర్చు చేసి చిత్రాలు, మందిరాలు మొదలైనవాటిని ఎందుకు తయారుచేస్తారు? ఇదంతా ధనాన్ని వ్యర్థము చేయడమే. మందిరాలు మొదలైనవాటిని నిర్మించడములో లక్షల రూపాయలు ఖర్చు చేస్తారు. తండ్రి కూర్చొని ఎంత ప్రేమగా అర్థం చేయిస్తారు. నేను పిల్లలైన మీకు అపారమైన ధనాన్ని ఇచ్చాను, దానినంతా ఎక్కడ పోగొట్టుకున్నారు. రావణ రాజ్యములో మీరు ఎలా ఉన్నవారు ఎలా అయిపోయారు. ఈశ్వరుని ఇచ్ఛపై రాజీ అయిపోవాలని కాదు. ఇదేమీ ఈశ్వరుని ఇచ్ఛ కాదు, ఇది మాయ తల రాత. ఇప్పుడు మీకు ఈశ్వరుని రాజ్యభాగ్యము లభిస్తుంది. అక్కడ దుఃఖపు విషయమేదీ ఉండదు. ఈశ్వరుని ఇచ్ఛకు మరియు ఆసురీ ఇచ్ఛకు ఎంత తేడా ఉంది. ఈ వివేకము మీకు ఇప్పుడు లభిస్తుంది. అది కూడా నంబరువారు పురుషార్థానుసారముగా. జ్ఞానపు ఇంజక్షన్ ఎవరికి లభిస్తుంది, ఇది అర్థం చేసుకోగలరు. ఫలానావారికి జ్ఞానపు ఇంజక్షన్ బాగా వేయబడింది, ఫలానావారికి తక్కువగా వేయబడింది, వీరికైతే ఏమాత్రమూ వేయబడలేదు, ఇది బాబాకే తెలుసు కదా. సేవ పైనే మొత్తమంతా ఆధారపడి ఉంది. వీరికి ఇంజక్షన్ వేయబడలేదు, సేవ చేయడం వీరికేమాత్రమూ తెలియదు అని సేవ ద్వారానే తండ్రి తెలియజేస్తారు. కొందరికి ఇంజక్షన్ ఎక్కువగా వేయబడింది, కొందరికి ఏమాత్రమూ వేయబడలేదు అన్నట్లు కూడా ఉన్నారు.

జ్ఞానాంజనమును సద్గురువు ఇచ్చారు, అజ్ఞానాంధకారము వినాశనమయ్యింది అని అంటారు. జ్ఞానము మరియు

సుఖము యొక్క సాగరుడు పరమపిత పరమాత్మ. కానీ వారిని రాయి, రప్పల్లో తోసేసారు. పిల్లలకు ఎంత నిశ్చయము ఉండాలి. అనంతమైన తండ్రి మనకు అనంతమైన సుఖాన్ని ఇస్తారు. అనంతమైన బాబా, మీరు ఎప్పుడైతే వస్తారో అప్పుడు మేము మీకు చెందినవారిగానే అవుతాము, మీ మతముపైనే నడుస్తాము అని గానం కూడా చేస్తారు. భక్తిలోనైతే అసలు తండ్రి గురించి తెలియనే తెలియదు, ఈ పాత్ర ఇప్పుడే నడుస్తుంది. ఇప్పుడే తండ్రి చదివిస్తారు. ఈ చదువు యొక్క పాత్ర మళ్ళీ 5000 సంవత్సరాల తర్వాత నడుస్తుందని మీకు తెలుసు. తండ్రి మళ్ళీ 5000 సంవత్సరాల తర్వాత వస్తారు. ఆత్మలందరూ పరస్పరం సోదరులు, తర్వాత శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తారు. మనుష్య సృష్టి వృద్ధి కూడా జరుగుతూ ఉంటుంది. ఆత్మల యొక్క స్టాక్ కూడా ఉంది కదా. ఎంతగా మనుష్యుల స్టాక్ పూర్తవుతుందో, అంతగానే అక్కడ ఆత్మల స్టాక్ ఉంటుంది. పాత్రధారులు ఒక్కరు కూడా ఎక్కువ, తక్కువ అవ్వరు. వీరంతా అనంతమైన పాత్రధారులు. వీరికి అనాది పాత్ర లభించి ఉంది. ఇది అద్భుతము కదా. ఇప్పుడు పిల్లలైన మీరు ఎంత వివేకవంతులుగా అయ్యారు. ఈ చదువు ఎంత ఉన్నతమైనది. మిమ్మల్ని చదివించేవారు స్వయంగా జ్ఞానసాగరుడైన తండ్రే, మిగిలినవారంతా భక్తి సాగరులు. ఏ విధముగా భక్తికి గౌరవము ఉందో, అలాగే జ్ఞానానికి కూడా గౌరవము ఉంది. భక్తిలో మనుష్యులు ఈశ్వరార్థము ఎంతగా దానపుణ్యాలు చేస్తారు ఎందుకంటే వేద-శాస్త్రాలు మొదలైనవాటిని ఎంతో పెద్ద-పెద్దవి తయారుచేస్తారు.

ఇప్పుడు పిల్లలైన మీకు భక్తి మరియు జ్ఞానము యొక్క తేడా తెలిసింది. ఎంతటి విశాలబుద్ధి కావాలి. మీ దృష్టి ఎప్పుడూ ఎవ్వరి వైపుకూ వెళ్ళదు. ఈ రాజు, రాణులు మొదలైనవారిని మేము ఏమి చూస్తాము, వారిని చూసేదేముంది అని మీరు అంటారు. హృదయములో ఎటువంటి ఆశా ఉండదు. ఇవన్నీ అంతమవ్వనున్నాయి. ఎవరి వద్ద ఏమి ఉంటుందో అదంతా అంతమవ్వనున్నది. కడుపైతే అదే రెండు రొట్టెలను అడుగుతుంది కానీ దాని కొరకు ఎంత పాపం చేస్తారు. ఈ సమయములో ప్రపంచములో అంతా పాపమే పాపము ఉంది. కడుపు ఎంతో పాపము చేయిస్తుంది. ఒకరిపై ఒకరు అసత్యమైన కళంకాలను మోపుతారు. ధనాన్ని కూడా ఎంతగానో సంపాదిస్తారు. ఎంత ధనాన్ని దాచిపెడతారు. ప్రభుత్వము ఏమి చేయగలదు. ఎవరు ఎంతగా దాచినా కానీ అది దాగదు. ఇప్పుడైతే ప్రకృతి వైపరీత్యాలు కూడా రానున్నాయి. ఇంకా కొద్ది సమయమే ఉంది. శరీర నిర్వహణార్థము ఏమైనా చేయండి, దాని కొరకు వద్దనేమీ అనరు అని తండ్రి అంటారు. పిల్లలలో సంతోషపు పాదరసము పైకి ఎక్కి ఉండాలి. తండ్రి మరియు వారసత్వము గుర్తుండాలి. తండ్రి అయితే మిమ్మల్ని మొత్తం విశ్వానికి యజమానులుగా తయారుచేస్తారు. భూమి, ఆకాశము అన్నీ మీవిగా అయిపోతాయి. ఎటువంటి హద్దు ఉండదు. మేమే యజమానులుగా ఉండేవారము అని పిల్లలకు తెలుసు. భారత్ అవినాశీ ఖండముగా గానం చేయబడింది కావున పిల్లలైన మీకు ఎంతో సంతోషము ఉండాలి. హద్దులోని చదువు యొక్క సంతోషము కూడా ఉంటుంది కదా. ఇదైతే అనంతమైన చదువు. అనంతమైన తండ్రి దీనిని చదివిస్తారు. ఇటువంటి తండ్రిని స్మృతి చేయాలి. ఆ భౌతికమైన వ్యాపారాలు మొదలైనవి అసలు ఏమిటి, అవి ఏమీ కాదు అని పిల్లలు అర్థం చేసుకోగలరు. మనం తండ్రి నుండి ఏం వారసత్వాన్ని పొందుతాము. ఎంతగా రాత్రికి, పగలుకు ఉన్నంత తేడా ఉంది. మనమైతే భౌతికమైన వ్యాపారాలు మొదలైనవి చేస్తూ కూడా అక్కడకు వెళ్ళి కిరీటధారులుగా అవుతాము. తండ్రి చదివించేందుకు వచ్చారు కావున పిల్లలకు సంతోషము కలగాలి. ఆ కార్యవ్యవహారాలు కూడా చేస్తూ ఉండాలి. ఇది పాత ప్రపంచమని, దీని వినాశనం కొరకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని అర్థం చేసుకున్నారు. ఎటువంటి పనులు చేస్తారంటే దాని ద్వారా పెద్ద యుద్ధము జరిగిపోతుందేమో అని భయం కలుగుతుంది. ఇవన్నీ డ్రామానుసారంగా జరుగవలసిందే. వీటిని ఈశ్వరుడు చేయిస్తారని కాదు. ఇవి డ్రామాలో రచింపబడి ఉన్నాయి. ఇవాళ కాకపోతే రేపు వినాశనం తప్పకుండా జరుగనున్నది. ఇప్పుడు మీరు చదువుతున్నారు. మీ కొరకు కొత్త ప్రపంచము తప్పకుండా కావాలి. ఈ విషయాలన్నింటినీ లోలోపల స్మరిస్తూ సంతోషించాలి. తండ్రి ఈ రథాన్ని కూడా తీసుకున్నారు, వీరికైతే ఏమీ లేదు, అన్నింటినీ వదిలివేసారు. అనంతమైన రాజ్యాధికారము లభిస్తుంది కావున ఇక వీటినేమి చేసుకుంటారు. అల్ఫ్ కు అల్లా లభించాక ఇక ఈ గాడిద చాకిరి ఏమి చేస్తాము? అని బాబాది ఒక పాట కూడా తయారుచేయబడింది. వ్యాపారాన్ని తక్కువో, ఎక్కువో ఇచ్చేసి ఇక పూర్తిగా సమాప్తం చేసేసారు. శరీరాన్ని కూడా బాబాకు ఇచ్చేసారు. ఓహో! మేమైతే విశ్వాధిపతిగా అవుతున్నాము, అనేక సార్లు అధిపతిగా అయ్యాము. ఇది ఎంత సహజమైన విషయము. మీరు మీ ఇంట్లో ఉండండి కానీ స్వయాన్ని ఆత్మగా భావిస్తూ తండ్రిని స్మృతి చేయండి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. ఎటువంటి తృప్త ఆత్మలుగా మరియు విశాలబుద్ధి కలవారిగా అవ్వాలంటే ఎవ్వరి వైపుకు దృష్టి వెళ్ళకూడదు. మనసులో ఎటువంటి ఆశ ఉండకూడదు ఎందుకంటే ఇదంతా వినాశనం అవ్వనున్నది.

2. శరీర నిర్వహణార్థము కర్మలు చేస్తూ సంతోషపు పాదరసము సదా ఎక్కి ఉండాలి. తండ్రి మరియు వారసత్వము గుర్తుండాలి. బుద్ధి హద్దులో నుండి తొలగి సదా అనంతములో ఉండాలి.

వరదానము:- తీవ్ర పురుషార్థము ద్వారా సర్వ బంధనాలను దాటి వేసి మనోరంజనాన్ని అనుభవాన్ని చేసే డబుల్ లైట్ భవ

కొంతమంది పిల్లలు ఏమంటారంటే - మామూలుగానైతే నేను బాగానే ఉన్నాను కానీ ఈ కారణాలు ఉన్నాయి కదా - సంస్కారాల బంధనము, వ్యక్తుల బంధనము, వాయుమండలం యొక్క బంధనము ఉంది... కానీ కారణాలు ఎలా ఉన్నా సరే, అవి ఏవైనా సరే, తీవ్ర పురుషార్థులు అన్ని విషయాలను అసలేమీ లేనే లేనట్లుగా దాటి వేస్తారు. వారు సదా మనోరంజనాన్ని అనుభవం చేస్తారు. ఇటువంటి స్థితిని ఎగిరే కళ అని అంటారు మరియు ఎగిరే కళకు గుర్తు డబుల్ లైట్. వారిని ఏ విధమైన భారము అలజడిలోకి తీసుకురాలేదు.

స్లోగన్:- ప్రతి గుణాన్ని మరియు జ్ఞానపు విషయాన్ని మీ నిజ సంస్కారముగా చేసుకోండి.